



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
నవంబరు 22, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం

- 26 లేదా 27న షెడ్యూల్ విడుదల అవకాశాలు
- జిల్లాల రిజర్వేషన్ ధృవీకరణకు తుది దశ
- రేపే నూతన రిజర్వేషన్ జీఓ ప్రకటింపు
- 3 విడతల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- తేదీల నిర్ణయంపై కేబినెట్‌లో కీలక పరి శీలన



హైదరాబాద్, నవంబర్ 21 : గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నెల 26 లేదా 27న పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు ప్రబలంగా కనిపిస్తున్నాయి. షెడ్యూల్ విడుదల అనంతరం హైదరాబాదు, మేడ్చల్%-%మల్కాజిగిరి నగర జిల్లాలను మినహాయించి మొత్తం 31 జిల్లాల్లో ప్రవర్తనా నియమావళి అమల్లోకి రానుంది. నవంబర్ 25న జరగనున్న కేబినెట్ భేటీలో రిజర్వేషన్ల తుది నిర్ణయం, పోలింగ్ తేదీల ఆమోదం, తదితర అంశాలు నిర్ణయించి ఎన్నికల కమిషన్‌కు సమాచారం పంపే అవకాశముంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించేందుకు సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రతి గ్రామ పంచాయతీని విడతల వారీగా వర్గీకరించి, ఎన్ని సర్పంచ్, వార్డు స్థానాలకు ఏ దశలో పోలింగ్ జరపాలో కమిషన్ అంతర్గత కసరత్తు పూర్తిచేస్తోంది. షెడ్యూల్ 27న వెలువడితే డిసెంబర్ 10 లేదా 11న తొలి దశ, మూడు రోజుల వ్యవధితో 13 లేదా 14న రెండో దశ, అదే గ్యాప్‌తో 16 లేదా 17న మూడో దశ జరుగే అవకాశముందని అధికారులు సూచిస్తున్నారు. పోలింగ్ ముగిసిన రోజునే స్థానిక ఓట్ల లెక్కింపును పూర్తిచేసి ఫలితాలు ప్రకటించనున్నట్లు సమాచారం.ఏ దశలోనైనా ఉపసర్పంచ్ ఎన్నిక నిలిచిపోయినా, తదుపరి రోజు సెలవు దినమ్మెనా తప్పక నిర్వహించాలి అనే నిబంధన కొనసాగనుంది.

**రిజర్వేషన్ జీఓ ఈరోజే**

డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా

(మిగతా 2వ పేజీలో)



## పీజీ మెడికల్ ప్రవేశాల తర్వాత నిబంధనల మార్పు సరికాదు: హైకోర్టు

- ప్రవేశాల ప్రక్రియ మొదలైన తర్వాత కొత్త 'లోకల్ కోటా' రూల్స్ పై ధర్మాసనం ఆక్షేపణ
- ప్రభుత్వం జారీ చేసిన జీఓ 200ను ఈ విద్యా సంవత్సరానికి స్టే



## హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్

- మావోయిస్టు కేంద్ర కమిటీ ఆరోపణ..
- ఫిరాయింపు కథనాలన్నీ కల్పితం
- మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై అనేక ప్రశ్నలు
- 23న దేశవ్యాప్త బంద్‌కు అభయ్ పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మా మృతిపై మావోయిస్టులు తీవ్ర ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. హిడ్మా, ఆయన భార్య రాజేను సజీవంగానే అదుపులోకి తీసుకొని, అక్కడే కఠిన హింసకు గురిచేసి చంపారని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక లేఖలో పేర్కొన్నారు. అనంతరం అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌గా కథను నక్కినట్టు మార్చి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న దేశవ్యాప్తంగా బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. 20వ తేదీన రాసిన అభయ్ లేఖ శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అభయ్ వెల్లడించిన వివరాల ప్రకారం హిడ్మా, ఆయన జీవిత సహచరి

(మిగతా 2వ పేజీలో)

# దుబాయ్ ఎయిర్‌షోలో కుప్పకూలిన తేజస్



- టేకాఫ్ వెంటనే నియంత్రణ కోల్పోయిన ఫైటర్ జెట్
- ప్రమాదంలో పైలెట్ మృతి
- అగ్నిజ్వాలల్లో మునిగిపోయిన యుద్ధ విమానం
- కారణాలపై పూర్తి స్థాయి విచారణ ప్రారంభం
- ఐఏఎఫ్ దిగ్భ్రాంతికుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ
- రెండున్నర దశాబ్దాల్లో రెండో తేజస్ ప్రమాదం

న్యూఢిల్లీ/దుబాయ్: ప్రపంచ విమాన ప్రదర్శన వేదికగా నిలిచిన దుబాయ్ ఎయిర్‌షోలో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే-1 విన్యాసాల్లో పాల్గొంటున్న సమయంలో హఠాత్తుగా కూలిపోయి అగ్ని కీలల్లో మునిగిపోయింది. పైలట్ వింగ్ కమాండర్ నమాన్ సయాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాల్లోనే విమానం కిందకు జారిపడటం, వెంటనే అగ్ని బంతిలా పేలిపోవడంలో ఉన్నవారిని భయానక దృశ్యానికి గురిచేసింది. దట్టమైన పొగ ఎగిసిపడటంతో ఎయిర్‌షో ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. అగ్నిమాపక బృందాలు ప్రయత్నించి మంటలను

(మిగతా 2వ పేజీలో)



## స్టార్టప్ రంగంలో ప్రపంచవేదికపై తెలంగాణ

- విద్య-నైపుణ్యం-ఉపాధికి కేంద్రంగా నూతన విధానం
- జేఎన్‌టీయూహెచ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ
- జేఎన్‌టీయూహెచ్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: తెలంగాణను స్టార్టప్ ఆర్థిక వ్యవస్థకు అగ్రగామిగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయనురాష్ట్ర విద్యా విధానం పూర్తిగా మార్పు దిశగా సాగుతోందని, "తెలంగాణ రైజింగ్-2047" పథకంలో విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.

**యువత ఉద్యోగాలను సృష్టించే స్థాయి అవసరం**

భట్టి మాట్లాడుతూుతరాలు ఉద్యోగాలు వెతుక్కునే దశనుంచి, వాటిని సృష్టించే దిశగా నడవాలని అన్నరు. విద్య ఖర్చు కాదని, దీర్ఘకాల పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని

(మిగతా 2వ పేజీలో)



## పాకిస్తాన్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి

# యువతకు భారతీయ సంస్కృతి చేరాల్సిన అవసరం ముఖ్యం

::: రాష్ట్రపతి ముర్ము

- రాష్ట్రపతి నిలయంలో రెండో భారతీయ కళా మహోత్సవం ప్రారంభం
- పశ్చిమ రాష్ట్రాల ఆచారాలు, కళామతాలు తెలంగాణకు పరిచయం
- దేశ సంస్కృతిని యువత గ్రహించేలా కార్యక్రమాల ప్రాముఖ్యతపై ముర్ము వ్యాఖ్య
- హస్తకళలు నుంచి వంటకాల వరకు తొమ్మిది రోజుల సాంస్కృతిక ప్రదర్శనలు
- ఎక్ భారత్-శ్రేష్ట్ భారత్ తత్వానికి ప్రతిరూపంగా ఈ ఉత్సవం
- రాష్ట్రపతికి మేడారం జాతరకు మంత్రి సీతక్క ఆహ్వానం
- రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవం ఘన ప్రారంభం



హైదరాబాద్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైవిధ్యాన్ని యువత అధ్యయనం చేయడం అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పష్టం చేశారు. భారతదేశంలోని పశ్చిమ రాష్ట్రాల కళా వారసత్వాన్ని తెలంగాణ ప్రజలకు అందించేందుకు రూపొందించిన భారతీయ కళా మహోత్సవం%-%2025 రెండో ఎడిషన్ శుక్రవారం సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ప్రారంభమైంది. రాష్ట్రపతి ముర్ము సంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవానికి శ్రీకారం చుట్టగా, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ షెకావత్, మంత్రి సీతక్క తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమ భారత సంస్కృతి హైలైట్**

ఈ ఉత్సవం తొమ్మిది రోజులపాటు సాగనుంది. గుజరాత్, మహారాష్ట్ర,

(మిగతా 2వ పేజీలో)

# పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం

మంత్రుల సంతకాలు పూర్తి కావడంతో రిజర్వేషన్లపై సవరించిన జీఓను ప్రభుత్వం ఈరోజే విడుదల చేయనుంది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండకూడదు అన్న సుప్రీంకోర్టు, హైకోర్టు సూచనల మేరకు తాజా మార్పులు చేపట్టారు. జిల్లాల వారీగా రిజర్వేషన్ కేటాయింపులను కలెక్టర్లు త్వరితగతిన సిద్ధం చేసి గెజిట్ రూపంలో ప్రచురిస్తారు. ఈ వివరాలన్నిటిని పంచాయతీ రాజ్ శాఖ సమగ్రంగా ఎస్ఈసీకి అందజేయనుంది. సవరించిన రిజర్వేషన్ విధానంలో మహిళలకు అన్ని కేటగిరీల్లో 50 శాతం లాటరీ విధానంలో కేటాయింపు జరగనుంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు స్థాయిల్లో రిజర్వేషన్ల లెక్కింపు పనులు గణనీయంగా వేగం అందుకున్నాయి. ప్రతి జిల్లా ఎంపీడీఓలకు బీసీ కమిషన్ నివేదికలు చేరడంతో వారు ఎస్టీ, ఎస్సీ, బీసీ జనాభా పరిమాణాన్ని పరిశీలిస్తూ స్థానాల వారీగా కేటాయింపుల దశాబ్దంలో ముందుకెళ్తున్నారు. శనివారం కల్లా అన్ని జిల్లాల నుండి ప్రాథమిక నివేదికలు సిద్ధమవుతాయి. ప్రభుత్వ జీఓలో పొందుపరిచే మార్గదర్శకాలు వచ్చిన వెంటనే వాటితో సరిపోల్చి తుది రిజర్వేషన్ జాబితా రూపొందిస్తారు. ప్రక్రియ పూర్తైన వెంటనే జిల్లాల కలెక్టర్లు గెజిట్‌ను విడుదల చేస్తారు. అనంతరం రాష్ట్రం ఎన్నికలకు పూర్తిగా సిద్ధమైందనే నివేదికను ఎస్ఈసీకి చేరవేస్తుంది. ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వం, ఎస్ఈసీ ఈ నెల 24న హైకోర్టుకు నివేదించనున్నారు. కోర్టు స్పందనల ఆధారంగా షెడ్యూల్ విడుదల ఖరారవుతుంది.





## సీనియర్ కాంగ్రెస్ నేత ఇలియాస్ షరీఫ్ జన్మదిన వేడుకలు

### ::: పాల్గొన్న ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మియాపూర్ 108 కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇలియాస్ షరీఫ్ పుట్టినరోజు సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కే ప్రసాద్ వారిని కలసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. అలాగే మియాపూర్ 108 సభ్యుడు ప్రగతి ఎంక్లేవ్ వాస్తవ్యులు అబ్బూరి పెద్దబాబు పుట్టినరోజు సందర్భంగా ఇలియాస్ షరీఫ్ , డి ఎస్ ఆర్ కే ప్రసాద్ లు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించడంజరిగినది. మియాపూర్ 108 డివిజన్ నుండి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , ప్రసాద్ ఫౌండేషన్ సభ్యులు ఎం.ఆర్.కె చౌదరి, వినోద్ చౌదరి, శ్రీను, సుదులగుంట్ల ప్రసాద్ చౌదరి, శ్రీకాంత్, పెద్దబాబు, మధు సుధన్ రెడ్డి, తులసి, బాలు, పవన్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, మధు లు ఇలియాస్ షరీఫ్ కు పుట్టినరోజు సందర్భంగా ఆయనను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్



రాజే చికిత్స కోసం ఇటీవల విజయవాడకు చేరుకున్నారు. చికిత్స జరుగుతున్న సమయంలో కొందరు సమాచారదారుల ద్వారా వారి వివరాలు పోలీసులకందాయని, కేంద్ర హోమ్ శాఖ సూచనలతో ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ బలగాలు ఈ నెల 15న వారిని రహస్యంగా అదుపులోకి తీసుకున్నాయని పేర్కొన్నారు. లొంగిపోవాలంటూ ఒత్తిడి చేయగా, హిడ్మా తిరస్కరించడంతో ఇద్దరినీ హతమార్చారని అభయ్ ఆరోపించారు. తర్వాత మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌గా ప్రకటించడమంతా "పూర్తిగా కల్పితం" అని లేఖలో పేర్కొన్నారు. అలాగే ఆంధ్ర-ఒడిశా బోర్డర్ కమిటీ సభ్యుడు శంకర్‌తో పాటు మరికొంత మందిని రంపచోడవరం ప్రాంతంలో తొలుత పట్టుకొని తర్వాత కాల్చిచంపి, తరువాత దానిని కూడా ఎన్‌కౌంటర్‌గా ప్రచారం చేశారని ఆరోపించారు. హిడ్మా మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడని, చివరి వరకు పోరాట మార్గాన్నే అనుసరించాడని, లొంగిపోవడం అంగీకరించలేదని అభయ్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ప్రాణాలు కోల్పోయిన శంకర్, రాజే, చైతు, కమ్లూ, ముల్లాల్, దేవేలకు పార్టీ తరపున శ్రద్ధాంజలి సమర్పిస్తున్నట్లు తెలిపారు. మార్క్సిస్టు సిద్ధాంతాలను లోతుగా అధ్యయనం చేసి, కేడర్ల అభ్యాసానికి అనేక సర్క్యులర్లు, పుస్తకాలు రాసి హిడ్మా మార్గదర్శకుడిగా నిలిచాడని అభయ్ లేఖలో పేర్కొన్నారు. దసైనిక వ్యూహాల్లో ప్రత్యేక నైపుణ్యం ప్రదర్శించిన హిడ్మా వల్లనే పీఎల్‌జీఏ వందలాది ఆయుధాలను స్వాధీనం చేసుకుందని తెలిపారు. దక్షిణ సబ్‌జోన్‌లో జనతన ప్రభుత్వ నిర్మాణానికి కూడా అతని పాత్ర ప్రధానమని అన్నారు. హిడ్మాను "నిర్దాక్షిణ్యుడిగా" చిత్రీకరిస్తూ పాలకవర్గ మీడియా ఎంతోకాలంగా తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తోందని అభయ్ విమర్శించారు. ఆయన మృతి తర్వాత ఈ విషప్రచారం మరింత ఉధృతమైందని తెలిపారు. హిడ్మా ప్రజల హృదయాల్లో నిలిచిపోయే నాయకుడని, భగత్‌సింగ్, కొమురంభీం, గుండాదూర్, గేంద్‌సింగ్, అల్లూరి సీతారామరాజు లా చరిత్రలో చోటు సంపాదిస్తాడని పేర్కొన్నారు.

## జిల్లా కోర్టును సందర్శించిన విస్డం విద్యార్థులు




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21 : జగిత్యాల జిల్లా విజ్డం హై స్కూల్ రాయికల్ కి చెందిన విద్యార్థులు ఎడ్యుకేషన్ టూర్ లో భాగంగా శుక్రవారం రోజున జిల్లా కోర్టును సందర్శించారు. గంటన్నరసేపు కోర్టులో జరిగే కేసుల విచారణ, న్యాయ వాదుల వాదోపవాదాలు, జడ్జి తీర్పునిచ్చే విధానాన్ని విద్యార్థులు గమనించారు. కోర్టు ఆవరణలోని రికార్డ్ రూమ్, సెక్షన్ రూమ్ లలో కేసులకు సంబంధించిన ఫైల్స్ ను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం, జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయాలను సందర్శించి వివిధ రకాల సేవలు సమస్యల పరిష్కా రాల గురించి సంబంధిత అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ విద్యా ర్థులకు కేవలం పుస్తకాలలో చదువు మాత్రమే కాకుండా, ఇలాంటి ఎడ్యుకేషన్ టూర్ ల ద్వారా విజ్ఞానం తో పాటు మంచి, చెడు ల మధ్య తేడాలు, నేరాల మీద వాటికీ విధించే శిక్ష ల మీద అవగాహన, సమాజం లో విద్యార్థులకు ప్రశ్నించే తత్వం, ఉన్నత అధికా రులతో ప్రవర్తించే తీరు, వారితో పని తీసుకోవడంలో అవగాహన తో పాటు జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతా యని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## స్టార్టప్ రంగంలో ప్రపంచవేదికపై తెలంగాణ



స్పష్టంచేశారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరు కలిగిన జేఎన్‌టీయూహెచ్ దేశ అభివృద్ధికి ఇంజన్‌లా నిలవాలన్నారు. నిజాయితీతో ప్రవేశ పరీక్షలు నిర్వహించడం, అనుబంధ కళాశాలలకు మార్గనిర్దేశం చేయడం, ఇన్నోవేషన్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే ప్రయాణంలో విశ్వవిద్యాలయం కీలక భాగమని అభినందించారు.

**వర్సిటీ సమస్యల పరిష్కారానికి భరోసా**

జేఎన్‌టీయూహెచ్ ప్రతిష్టను మరింత బలపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి ప్రకటించారు. వర్సిటీ భూముల లీజు వివాదం, లీజ్ అద్దె, ఆస్తి పన్ను విషయంలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.800 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది అని చెప్పారు.

**విద్యారంగ పునర్‌నిర్మాణం ప్రారంభం**

తెలంగాణ విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు చేస్తున్నామని భట్టి వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సాంకేతిక విద్యను ఆధునీకరణ చేస్తోందని చెప్పారు. పరిశ్రమలకు ఇప్పుడు అత్యంత నైపుణ్యం కలిగిన యువశక్తి అవసరం పెరిగిందనీ, అందుకే బోధనా విధానాల్లో మల్టీ%-%డిసిప్లినరీ మోడల్‌ను బలపరుస్తున్నామని వివరించారు.

## పాకిస్తాన్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాయిలర్ పేలడంతో 15 మంది మృతి చెందారు. పంజాబ్ ప్రావిన్స్ తూర్పు ప్రాంతం ఫైసలాబాద్‌లోని గ్లూ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన జరిగిన తర్వాత ప్రమాద స్థలం నుంచి ఫ్యాక్టరీ యజమాని పరార్ అవ్వగా.. ఫ్యాక్టరీ మేనేజర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పేలుడు దాటికి ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలో ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. పేలుడుకు కారణాలు తెలియరాలేదు. బాయిలర్ పేలడానికి కారణం ఏమిటో తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## పీజీ మెడికల్ ప్రవేశాల తర్వాత నిబంధనల మార్పు సరికాదు: హైకోర్టు

హైదరాబాద్: పీజీ మెడికల్ కోర్సుల ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం అకస్మాత్తుగా 'లోకల్ కోటా'పై కొత్త నిబంధనలు అమల్లోకి తేవడం సరికాదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. నవంబర్ 3న జారీ చేసిన జీఓ-200 ద్వారా స్థానికులకు 85%, అఖిల భారత కోటాకు 15% కేటాయింపు నిర్ణయాన్ని ధర్మాసనం నిలిపివేసింది. ఈ జీఓ 2025-26 విద్యా సంవత్సరానికి వర్తించదని, ప్రవేశాలు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో నిబంధనలను మార్చే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్, అన్-ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ మెడికల్ కళాశాలల మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు ఈ జీఓను వర్తింపజేయడం చట్టరీత్యా సరైన ప్రక్రియ కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల ఈ విద్యా సంవత్సరానికి పాత విధానమే కొనసాగాలి అని తేల్చిచెప్పింది.

**ప్రభుత్వం, వర్సిటీకి కౌంటర్లకు గడువు**

కేసులో ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ నాలుగు వారాల్లో తమ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఆపై రెండు వారాల్లో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. తదుపరి విచారణ జనవరి 19కి వాయిదా పడింది.

**పిటిషనర్ల వాదనలు**

బెంగళూరుకు చెందిన స్వరూప్ హెచ్‌ఈఎస్ సహా పలువురు నాన్-లోకల్ విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. వారి తరఫు సీనియర్ న్యాయవాది జి.మోహన్‌రావు వాదనలు: ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కోటా మార్పు చేయడం చట్టవిరుద్ధం

**నాన్-లోకల్ విద్యార్థులకు గణనీయ అన్యాయం**

కాళోజీ వర్సిటీ విడుదల చేసిన అడ్మిషన్ నోటిఫికేషన్‌కు జీఓ-200 విరుద్ధం కాబట్టి జీఓను రద్దు చేయాలని కోరిక

**సర్కార్ స్పందన**

వైద్య ఆరోగ్య శాఖ జీపీ రమేశ్, కాళోజీ వర్సిటీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ టి.శరత్ మాట్లాడుతూప్రభుత్వ వివరాలు సేకరించడానికి సమయం కావాలని కోరారు.

## బిజెపి అభ్యర్థులకి ఎన్నికల దిశా నిర్దేశం



### బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మండల అధ్యక్షులు కే.రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులు తమ తమ గ్రామ పంచాయతీలలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఈ రోజే ప్రజల్లోకి వెళ్లి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి పరశురాం, అలాగే రాములు, బుచ్చన్న, ప్రవీణ్ రెడ్డి, అఖిల్, కొమ్ము శీను, లక్ష్మణ్ గౌడ్, శివ గణేష్, ఆంజనేయులు, మల్లేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం



కేటీఆర్ తెలిపారు. అంటే మొత్తం విలువ 4%-%5 లక్షల కోట్లు అని అన్నారు. కానీ ప్రభుత్వం వీటిని క్రమబద్ధీకరణ పేరుతో కేవలం ప్రభుత్వ రేటు 30% ధరకు ఇవ్వడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. "నిజమైన విలువలో 70% ఎక్కడికి వెళ్తుంది? ఎవరి కోసం ఈ రాయితీలు?" అని ఆయన ప్రశ్నించారు. ఈ భూములు మొదట పరిశ్రమల అభివృద్ధికి కేటాయించబడినప్పటికీ, ఇప్పుడు పంథా మారిందని, పరిశ్రమల పేరిట భూములను నిర్దిష్ట ప్రైవేట్ గ్రూపులకు చేరవేసే ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు. గతంలో ఇలాంటి ప్రతిపాదనలు తాము అధికారంలో ఉన్నప్పుడు తిప్పికొట్టామని, "ప్రభుత్వ ఆస్తిపై దోపిడీకి ఏదో ఓ పాలసీ సాకుగా వాడుతున్నట్టుంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. హెచ్‌ఐఎల్‌టీపీ ప్రకారం క్రమబద్ధీకరణ దరఖాస్తులకు 7 రోజుల్లో అనుమతి ఇవ్వడం, 45 రోజుల్లో మొత్తం ఫైల్ ముగించడంఈ వ్యవహారం వెనుక త్వరపడే కారణాలు అనుమానాస్పదంగా ఉన్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. "లక్షల కోట్ల భూముల నిర్ణయాలను ఇలా తొందరగా ఆమోదించడంలో ఏ అవసరం ఉంది? ఇది భూ సంస్కరణ కాదు, ఇప్పటికే మాట్లాడుకున్న లావాదేవీలకు ఇచ్చిన ఫాస్ట్ ట్రాక్" అని అన్నారు. ఈ అధికారిక పాలసీ వెనుక కొందరు ప్రత్యేక వ్యక్తుల ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అందులో ఏవీ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి పేర్లను ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ, "వీరి కోసం భూములను చట్టబద్ధం చేసే కాగితం ఇది" అని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో ఇళ్ల నిర్మాణ పథకాల కోసం, స్మశానవాటికల కోసం కూడా స్థలం లభించని పరిస్థితుల్లో, వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అందించడం ప్రజల పట్ల అన్యాయం అని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. "ప్రజల ఆస్తిని నిష్పక్షపాతంగా ఉపయోగించాలని ప్రభుత్వం భావిస్తే, ముంబై తరహాలో బహిరంగ వేలం పాట నిర్వహించాలి. అప్పుడు నిజమైన విలువ తెలుస్తుంది" అన్నారు. అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న లావాదేవీల వల్ల కనీసం 50,000 కోట్లు నేరుగా ప్రయోజనం పొందేలా 'ప్లాన్' సిద్ధమైందని ఆయన పేర్కొన్నారు.

**ఒప్పందాలు నిలవవు**

ఈ విధానంలో భూములు పొందడానికి ముందుకు రావొద్దని కేటీఆర్ పారిశ్రామికవేత్తలకు హెచ్చరిక జారీ చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే ఒప్పందాలన్నీ రద్దు చేస్తాం." అని స్పష్టం చేశారు.

**బీజేపీ స్పందించాలంటూ సవాల్**

ఈ వివాదంపై బీజేపీ మౌనం అనుమానాస్పదమని, ఇది నిజంగా ప్రజా ఆస్తుల దోపిడీ అయితే బీజేపీ ఎందుకు స్పందించటం లేదు? కాంగ్రెస్‌తో లావాదేవీ ఉందా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫార్ములా- రేసింగ్ అంశంపై తాను అరెస్టుకు భయపడనని, లై డిటెక్టర్ టెస్ట్‌కి కూడా సిద్ధం అని కేటీఆర్ స్పష్టం చేశారు. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు.

## ఇండియన్ జర్నలిస్టు యూనియన్
## కోశాధికారిగా మారుతి సగర ఎన్నిక హర్షణీయం
### అభినందనలు తెలిపిన
### వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కోశాధికారిగా సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సగర ఎన్నికయ్యారు. చండీఘర్ లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గణేష్ సాగర్ మాట్లాడుతూ ఒక సగర జాతి ఆణిముత్యమైన మారుతి సగర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సమాజానికి ప్రత్యేకంగా సగర జాతికి సేవ చేస్తూ ఉన్నతమైన పేరు ప్రఖ్యాతులు ఘటించాలని కాంక్షిస్తూ మారుతీ సగర కు వార్త మిర్రర్ దినపత్రిక తరపున అభినందనలు తెలిపారు

## మదిరే వినోద్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి- బిఆర్ఎస్ శ్రేణులు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం అనంతరం గ్రామంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు,మాదిరే వినోద్ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు,మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్. మాజీ సర్పంచ్ చిన్న మల్లికార్జున్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మీనారెడ్డి. ప్రభాకర్ రెడ్డి,బాలరాజు యాదవ్. మాజీ సర్పంచ్ పల్లెపాటి హరిబాబు పల్లెపాటి రవి (కొండలు) శివతదితరులు పాల్గొన్నారు

## కోట పద్మ కు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కును అందించిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామానికి చెందిన కోట పద్మ-శ్రీకాంత్ లకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి చెక్కును అందించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు,ఆర్ఎస్ కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట పద్మ పరిస్థితి తెలుసుకొని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితురాలకు చికిత్స నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల (ఎల్ఓసి) చెక్కును అందించారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ రాకల శ్రీనివాస్, నిరుపేద కుటుంబానికి చెందిన కోట పద్మ కు అండగా నిలిచిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ని బాధిత కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు అభినందించారు

## ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కోశాధికారిగా మారుతి సగర ఎన్నిక
### ::: అభినందనలు తెలిపిన తెలంగాణ సగర సంఘం నాయకులు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కోశాధికారిగా సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సగర ఎన్నికయ్యారు. చండీఘర్ లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.ఒక సగర జాతి ఆణిముత్యమైన మారుతి సగర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సమాజానికి ప్రత్యేకంగా సగర జాతికి సేవ చేస్తూ ఉన్నతమైన పేరు ప్రఖ్యాతులు ఘటించాలని కాంక్షిస్తూ మారుతీ సగర కు రాష్ట్ర సగర సంఘం తరపున అర్ధిక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు

## నాయి బ్రాహ్మణ జన జాగృతి అభివృద్ధి కి కృషిచేయాలి ఉప్పనుంతల బాలకృష్ణ



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : నాయి బ్రాహ్మణ జన జాగృతి అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాయి బ్రాహ్మణ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పనుంతల బాల కృష్ణ అన్నారు.విలేకరులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ హక్కుల సాధన కోసం న్యాయమైన డిమాండ్ల కోసం అందరూ పాటుపడాలని కోరారు. విద్య ఉద్యోగం రాజకీయాలలో వెనుకబడి పోతున్నాము అన్ని విధాలుగా నాయి బ్రాహ్మణుల కు సమాన హక్కులు కల్పించే విధంగా పోరాటాలు చేయడానికి ఈ జన జాగృతి స్థాపించడం జరిగింది. ప్రతి నాయి బ్రాహ్మణ సోదరులు ఈ జన జాగృతి అభివృద్ధికి బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మన సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు.నాయి బ్రాహ్మణ నాయకులు ఈ జన జాగ్రతిలో భాగస్వాములై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.జిల్లా కమిటీ, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయటం ద్వారా నాయి బ్రాహ్మణ జన జాగృతిని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించటం జరిగింది. అందులో భాగంగా నాయి బ్రాహ్మణ సమస్యల పట్ల అవగాహన ఉండి కులం కోసం పని చేయాలని ఆసక్తి గల వారిని నాయకులుగా తీర్చి దిద్దడానికి నిర్ణయించామని తెలిపారు.

## సాహితీ శిఖరం " అందెశ్రీ" చిత్రపటాన్ని పెన్సిల్ వర్క్ తో వేసిన
# ప్రముఖ ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాస్

**పెన్సిల్ ను ఉపయోగించి సజీవమైన రంగుల కళాఖండాలను సృష్టించడం మందుగుల శ్రీనివాస్‌కే సాధ్యం**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాస్ రంగుల పెన్సిల్ ను ఉపయోగించి సజీవమైన,రంగుల కళాఖండాలను సృష్టించడం అతనికే సాధ్యం.! నూతనంగా సాహితీ శిఖరం తెలంగాణ రాష్ట్ర గీతం" జయ జయహే తెలంగాణ సృష్టికర్త, ప్రముఖ కవి, రచయిత అందే శ్రీ చిత్రపటాన్ని పెన్సిల్ ఆర్ట్ తో వేసిన చిత్రం మందుగుల శ్రీనివాస్ హస్తకళా నైపుణ్యంతో వెలుపడ్డ ప్రముఖుల అద్భుత చిత్రాలు. ప్రముఖ ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాస్ హస్తకళ నైపుణ్యంతో పెన్సిల్ ఆర్ట్ తో వెలుపడ్డ అద్భుత చిత్రాలు శ్రీనివాస్ వేసిన పెన్సిల్ ఆర్ట్ తో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు, యుద్ధ నౌక గద్దర్, ప్రముఖ దర్శకుడు కె విశ్వనాథ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, సామాజిక వేత్త, ఆర్ ఎస్ కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గొల్లూరి గణేష్ సాగర్, మందుగుల శ్రీనివాస్ గురువు గంజి నర్సింగరావు, వంటి వారి ఫోటోలను వేసి ప్రముఖుల, ప్రజల ప్రశంసలను పొందిన గొప్ప ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాస్

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

### ప్రతి మత్స్య సహకార సంఘానికి ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ చేయాలి
### డి.ఎఫ్.సి.ఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు భానుచందర్



కల్వకుర్తి నవంబర్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:-ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం మరియు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ0 సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో మత్స్యకారులు శుక్రవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఎఫ్.సి.ఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు భానుచందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మత్స్య సహకార సంఘానికి ఉచిత చేప పిల్లలు బదులుగా నగదు బదిలీ చేయాలి 50 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్య సహకార సంఘం సభ్యునికి పెన్షన్ ఇవ్వాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొండ్ల ఆంజనేయులు. కార్యదర్శి కావలి మల్లేష్. డైరెక్టర్ గారెల సత్యం. డైరెక్టర్ గొడుగు మల్లయ్య. గొడుగు కృష్ణ. అర్చన.అప్పిస పెంటయ్య. గొడుగు బాలస్వామి. కొండ్ల శ్రీనివాసులు. కొండ్ల జంగయ్య. కొండ్ల కృష్ణయ్య. గొడుగు రవికుమార్. కొండ్ల పాండు. కావలి సత్యనారాయణ. గారెల శ్రీకాంత్.గారెల రాజు. గొడుగు ఆదర్శ్. గారెల సంజీవ. కంపిల్ల పర్వతాలు. కంపిల్ల శ్రీను. ఆఫీస మల్లేష్.గొడుగు రాజు. గారెల అంజి. కావాలి భాను. హరీష్. గొడుగు శివమణి. తర్నికల్ గ్రామ సొసైటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# న్యూఢిల్లీలో ముగిసిన చారిత్రక "రేజంగ్ల రాజ్ కలశ యాత్ర"

### అమరుల త్యాగాలకు నివాళి - అహీర్ రెజిమెంట్ సాధనే లక్ష్యంగా ఉక్కు సంకల్పంజాతీయ స్థాయిలో తెలంగాణ యాదవ సంఘం



దేవరకొండ నవంబర్ 21 వార్త మిర్రర్ :దేశవ్యాప్తంగా యాదవ జాతిని ఒకే తాటిపైకి తెస్తూ, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ చేపట్టిన చారిత్రక "రేజంగ్ల రాజ్ కలశ యాత్ర" నవంబర్ 18, 2025న దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అత్యంత ఘనంగా ముగిసింది. అహీర్ రెజిమెంట్ సాధనే ఏకైక లక్ష్యంగా సాగిన ఈ యాత్ర ముగింపు కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి యాదవ సంఘం నేతలు, యువకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై, తమ సంఘీభావాన్ని తెలిపారు.తెలంగాణ నాయకత్వానికి జాతీయ గుర్తింపుఈ యాత్ర విజయంలో తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం కీలక పాత్ర పోషించింది. సంఘ పెద్దలు ముఖ్యంగా యశ్వంత్ రాజ్ యూత్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో మరియు మాజీ సైనికుల విభాగం కన్వీనర్ శ్రీ జక్కుల శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో ఈ యాత్ర తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా సాగి, అనంతరం వివిధ రాష్ట్రాల మీదుగా న్యూఢిల్లీకి చేరుకుంది. యాత్రను విజయవంతం చేయడంలో సంఘ పెద్దలు చూపిన అంకితభావం, కృషిని జాతీయ నాయకత్వం గుర్తించింది.

## బిఆర్ఎస్ నాయకులు చెగురుపల్లి సోమయ్య గౌడ్ ను పరామర్శించిన - పైళ్ల శేఖర్ రెడ్డి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిగురుపల్లి సోమయ్య గౌడ్ ను పరామర్శించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు,మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్. మాజీ సర్పంచ్ చిన్న మల్లికార్జున్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మీనారెడ్డి. ప్రభాకర్ రెడ్డి,బాలరాజు యాదవ్. మాజీ సర్పంచ్ పల్లెపాటి హరిబాబు పల్లెపాటి రవి (కొండలు) శివ తదితరులు పాల్గొన్నారు



## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ఘనంగా కుంకుమ పూజలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 21: జగిత్యాల పట్టణం చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో తేదీ: 21.11.2025, మార్గశిర మాసం, శుక్ల పక్షం, శుక్రవారం పాడ్యమి పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేశారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం ఆలయ పూజారి ఆశీర్వచనములతో సత్కరించి బహుకరించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వద్లగట్ట రాజన్న, వోడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు తార, ఉషారాణి, జమున, వసంత, రాధ, నీరజ, రుచిత, హర్షిని, రమాదేవి, జయశ్రీ, కళ్యాణి, శ్రీలత, రజిత, అనిత, ఆదిలక్ష్మి, అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు మియాపూర్ లక్ష్మి నగర్ కాలనీలో
# మెగా ఉచిత వైద్య శిబిరం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో ప్రసాద్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 23 తారీఖు ఆదివారం రోజున ఉదయం 9 గంటల నుంచి మెడి కోవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో గుండె,జనరల్, క్యాన్సర్ , గైనకాలజిస్ట్ , పిడియాట్రిక్, కంటి పరీక్షలు, దంత వైద్య శిబిరం, ఈసీజీ , 2డి ఎకో , బీపీ , రక్త పరీక్షలు, షుగర్, కాన్సర్ సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, చీఫ్ కోఆర్డినేటర్ లీలా ప్రసాద్ లు విలేఖరుల సమావేశంలో తెలిపారు.

PRASADS FOUNDATION
MIYAPUR: HYDERABAD

# కార్తీకమాస మహాపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

### శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాస వేడుకలు





దేవరకొండ నవంబర్ 21 వార్త మిర్రర్ ::కార్తీకమాసం ముగింపు సందర్భంగా దేవరకొండ పట్టణంలోని స్థానిక శివాలయంలో ఘనంగా నిర్వహించిన మహాపూజ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతులు సమర్పించారు.అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఎమ్మెల్యే నుఆశీర్వదించి తీర్థ%-%ప్రసాదాలు అందజేశారు. కార్తీకమాసంలో భక్తి తపస్సు, దానం అత్యంత పున్యప్రదమని, దేవాలయాల్లో నిర్వహించే ఈ శుభకార్యాలు ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోదేవాలయ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి శీలా వెంకన్న, కోశాధికారి సముద్రాల నరహరి, నీల పాండరయ్య , మున్సిపల్ మాజీ చైర్మన్ అల్లంపల్లి నరసింహ, బెజవాడ నరేందర్, దామెర కుమార్, గోవిందు శ్రీనివాసులు, గోవిందు కొండయ్య, కర్నాటి పురుషోత్తం, బిక్కుమల్ల లక్ష్మీనారాయణ, కొత్త సుబ్బారావు ,శ్రీనివాస్ రెడ్డి సముద్రాల కృష్ణయ్య,గట్టు మోహనయ్య, గందె మురళి, సురభి కృష్ణమూర్తి, సూపర్వైజర్ రాము గౌడ్, గోవిందు శైలజ, గోవిందు లలిత, సముద్రాల చంద్రకళ, వడ్డేపల్లి గీత , దామెర విజయ, మారం అంజమ్మ, మారం శాలిని, గోవిందు పద్మ ,శీలా పద్మ, సముద్రాల రాజేశ్వరి, సముద్రాల రేణుక, నాళ్ళ విజయ, సాదు లక్ష్మి, దామెర ధనలక్ష్మి, మునిని నాగలక్ష్మి, సముద్రాల రజిని, కర్నాటి రాజ్యలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జిల్లా మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలకు మా మహేశ్వరం భూములు ఎందుకు.

### బి ఆర్ ఎస్ , కాంగ్రెస్ ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో పాతబస్తీగా మారుస్తున్నారు - శ్రీరాములు అందెల

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మామిడిపల్లి గ్రామంలో 50 ఎకరాల భూభాగంలో హైదరాబాద్ జిల్లాకు చెందిన మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం చేస్తున్నారని తెలిసి ఆ ప్రాంతాన్ని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మొదటిగా ఆ ప్రాంతంలో ఉన్నటువంటి సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని, పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయాన్ని, రంగనాయకుల స్వామి ఆలయాన్ని సందర్శించి హిందూ బంధువులు అందరితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ఈ భూమిలో అనేక ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నాయని నియోజకవర్గ హక్కులకు సంబంధం లేని, హైదరాబాద్ జిల్లాకు చెందిన మైనారిటీ స్కూల్‌ను ఇక్కడ ఎందుకు నిర్మించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరియు స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వానికి చాలానే ఖాళీ స్థలాలు ఉన్నాయని అవన్నీ వదిలి మహేశ్వరంకి వచ్చి ఇక్కడ నిర్మించడం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో దేవాలయ భూములను ఇండస్ట్రీలకు నిర్బంధంగా ఇచ్చేశారుబీ కానీ వాటికి ప్రత్యామ్నాయంగా ఒక్క గజం భూమి కూడా ఇవ్వలేదు అని గుర్తు చేశారు. సూర్యగిరి ఎల్లమ్మతల్లి ఆలయానికి ఇంతవరకు సరైన రోడ్డు సౌకర్యం లేదు, హిందువుల ఆస్తులకు రక్షణ లేకుండా పోయే పరిస్థితిని సబితా ఇంద్రారెడ్డి తెచ్చారన్నారు. “హిందూ దేవాలయ భూములను పట్టించుకోని ప్రభుత్వం, హామీ



చేసిన అభివృద్ధి పనులన్నీ మధ్యలో ఆపేసి, కేవలం ఓటుబ్యాంకు రాజకీయాల కోసం అవసరం లేని పనులు మాత్రమే చేస్తోంది. ఇది మహేశ్వరం ప్రజలపై అన్యాయం. ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణాన్ని అనుమతించము. ప్రభుత్వం వెంటనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై వారి అభ్యంతరాలను విన్నారు.

“ఇది నియోజకవర్గం గౌరవానికి, ప్రజల హక్కులకు జరిగిన దాడి. మహేశ్వరంలో హిందువుల, దేవాలయాల భూములను రక్షించడం మా బాధ్యత. ఈ విషయంపై పోరాటానికి వెనక్కి తగ్గే ప్రశ్నే లేదు” అని స్పష్టం స్పష్టం చేసి స్థానికులకు మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


# శ్రీశైలం నేషనల్ హైవేను పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : మహేశ్వరం నియోజకవర్గంలోని శ్రీశైలం హైవే రహదారిని జల్పల్లి మున్సిపాలిటీ ఎర్రకుంట వద్ద మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుగతం లోనే ఈ రహదారిని నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి తీసుకుని, మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఉన్న రోడ్డును నాలుగు లైన్లుగా వెడల్పు చేయడానికి ?80 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా చంద్రయాన్‌గుట్ట నియోజకవర్గ పరిధిలోని 1.8 కిలోమీటర్ల మిగిలి ఉన్న రహదారి ఆర్ అండ్ బీ శాఖ ద్వారా ఇంకా ?20 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మొత్తం ?100 కోట్లతో చంద్రయాన్‌గుట్ట నుంచి జల్పల్లి గేట్ వరకు 5.8 కిలోమీటర్ల ఫోర్ లైన్ రోడ్డు నేషనల్ హైవే అథారిటీ నొమ్స్ ప్రకారంగా నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.రోడ్డు పనులు అధికారికంగా ప్రారంభం కావడానికి కొంత సమయం పట్టినా, ప్రస్తుత రహదారి పరిస్థితులు దారుణంగా ఉన్నందున, రహదారిపై ఉన్న గోతులు, నీరు నిలిచే ప్రాంతాలను తక్షణమే సరిచేయాలని కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాత్కాలిక మరమ్మత్తులను వెంటనే చేపట్టి, నాణ్యతతో కూడిన శాశ్వత రహదారి పనులను త్వరితగతిన



ప్రారంభించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జల్పల్లి మున్సిపాలిటీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాస ముగింపు వేడుకలు





దేవరకొండ నవంబర్ 21 వార్త మిర్రర్ దేవరకొండ పట్టణంలోని శ్రీ శ్రీ భ్రమరాంబమల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాసం ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భక్తుల గోత్రనామాలతో స్వామివారికి వినిపించి అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన పార్వతీ పరమేశ్వరులకు వడి బియ్యం పోయాగా అనంతరం మహా నివేదన మంగళహారతి,కోనేటి దీపారాధన అత్యంత వైభవంగా వందలాదిమంది భక్తులచే నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించి సాయంకాలం దీపాలతో శివలింగ ఆకృతి దీపారాధన అనంతరం దీపాలంకరణలతో అందంగా అలంకరించిన ముగ్గురు మహిళా విజేతలకు ప్రత్యేక బహుమతులను గోవిందు శ్రీనివాసులు-పద్మ,సహజ కిడ్స్ ప్రిన్సిపాల్ సముద్రాల రేణుక-నరసింహ బహుమతులు అందజేశారు. సాయంకాలం అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి శీలా వెంకన్న, కోశాధికారి సముద్రాల నరహరి, నీల పాండరయ్య , మున్సిపల్ మాజీ చైర్మన్ అల్లంపల్లి నరసింహ, బెజవాడ నరేందర్, దామెర కుమార్, గోవిందు శ్రీనివాసులు, గోవిందు కొండయ్య, కర్నాటి పురుషోత్తం, బిక్కుమల్ల లక్ష్మీనారాయణ, కొత్త సుబ్బారావు ,శ్రీనివాస్ రెడ్డి సముద్రాల కృష్ణయ్య,గట్టు మోహనయ్య, గందె మురళి, సురభి కృష్ణమూర్తి, సూపర్వైజర్ రాము గౌడ్, గోవిందు శైలజ, గోవిందు లలిత, సముద్రాల చంద్రకళ, వడ్డేపల్లి గీత , దామెర విజయ, మారం అంజమ్మ, మారం శాలిని, గోవిందు పద్మ ,శీలా పద్మ, సముద్రాల రాజేశ్వరి, సముద్రాల రేణుక, నాళ్ళ విజయ, సాదు లక్ష్మి, దామెర ధనలక్ష్మి, మునిని నాగలక్ష్మి, సముద్రాల రజిని, కర్నాటి రాజ్యలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ బీసీ జేపసీ కో-చైర్మన్‌గా డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఎన్నిక

### నియామక పత్రం అందించిన జాజుల శ్రీనివాస్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి తెలంగాణ బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం శు క్రవారం హైదరాబాద్ కాచిగూడ లోని హెూటల్ అభినందన్ లో జరిగింది. ఈ సమావేశంలో 42 శాతం రిజర్వేషన్ల కు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వాల మీద వత్తిడి తీసుకువచ్చే ఉద్య మ కార్యాచరణ పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ కమిటీని విస్తరించడం జరిగింది. చైర్మన్ గా జాజుల శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గా గుజ్జ కృష్ణ, కో-చైర్మన్ గా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ను ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఉప్పరి శేఖర్ సగర కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , మాజీ ఎంపీలు హన్మంతరావు , మధుయాష్కి , బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశాచారి, బీసీ జేఏసీ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, మణిమంజరి సగర, విక్రమ్ గౌడ్ గారు, శ్యామ్ కుర్మా , సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ సగర తదితరులు పాల్గొన్నారు.





### తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షులు పాండురంగారెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం జనంబాట లో భాగంగా రెండు రోజులు రంగారెడ్డి జిల్లా పర్యటిస్తున్నాం. మహేశ్వరం, ఎల్ బీ నగర్, ఇబ్రహీం పట్నంలోని సమస్యలను ఇవ్వాళ తెలుసుకుంటాం. ప్రజలకు ఉన్న అనేక సమస్యలు వాటిని ఎలా పరిష్కరించాలన్న దానిపై స్థానికులు, మేధావులతో చర్చిస్తున్నాం. నిన్న శేరిలింగంపల్లి నుంచి రాజేంద్ర నగర్, చేవెళ్ల, షాద్ నగర్ లో ఉన్న సమస్యలు తెలుసుకున్నాం. నియోజకవర్గ స్థాయిలో గతంలో ఉన్న ఆఫీస్ లు కాకుండా ఇది తొలి అడుగు. మహేశ్వరంలో జాగృతి కార్యాలయం ద్వారా ప్రజలకు మంచి జరగాలి. మహేశ్వరం అంటేనే లక్కీ అనే పేరు ఉంది. జాగృతి కి కూడా శుభం జరగాలి.మహేశ్వరంలో గతంలో ఉద్యమంలో పనిచేసిన జాగృతి కార్యకర్తలు మళ్లీ సొంత గూటికి చేరుకుంటున్నారు. పెద్ద ఎత్తున చేరుతూ జాగృతిని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలను నాయకులను కోరారు



# మహేశ్వరం ఆర్టీసీ బస్సులో కె ఎల్ ఆర్

### ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలతో ముచ్చట

### రోజూ 36వేల మంది ఆడపడుచుల ప్రయాణం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : ప్రతీ బీద కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నెలకు దాదాపు రూ.3000 నుంచి రూ.4వేలు ఆదా అవుతుందని కిచ్చెన్న చెప్పారు.ఇవాళ మహేశ్వరం పట్టణంలో ఆర్టీసీ బస్సు ఎక్కి పలువురు మహిళా ప్రయాణికులతో లక్ష్మారెడ్డి ముచ్చటించారు. మహేశ్వరం డిపో ద్వారా ఉచితంగా 36 వేల మంది మహిళా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు స్పష్టం చేశారు.రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి త్వరలోనే మహేశ్వరం, కందుకూరు మండలాలకు ప్రతీ ఊరికి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ తీగల అనితారెడ్డి సహా మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీలు, గ్రామ, బూత్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరుపేదకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9 వ డివిజన్ నంది హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 14 లో నివాసం ఉండే కొట్టం యాదయ్య అక్క అనారోగ్య గురై హాస్పిటల్ లో అడ్మిట్ కావడం జరిగింది హాస్పిటల్ బిల్లు కట్టలేని పరిస్థితుల్లో 9 వ డివిజన్ ఇంచార్జి రామిడి నర్సిరెడ్డినీ సంప్రదించగా ఆయన కొట్టం యాదయ్య అక్క అనారోగ్య పరిస్థితిని మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యురాలు సబిత ఇంద్రారెడ్డి చొరవ తో 60,000 రూపాయల %జవీ% రిలీఫ్ ఫండ్‌చెక్ శాంక్షన్ చేయించి మేడం ఆదేశానుసారం శుక్రవారం బాధితులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రామిడి నర్సిరెడ్డి, మట్ట సత్యనారాయణ గౌడ్, జహంగీర్ పాల్గొనడం జరిగింది



# అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాలలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 21 : మహేశ్వరం మండల పరిధిలోని రామచంద్రగూడలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్ సోదరుడు మోతిలాల్ నాయక్ నిర్వహించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం..మరియు కందుకూరు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి గార్డెన్ లో “ఎక్స్ రోడ్డు” సన్నిధానం గురు స్వామి రామకృష్ణ చారి గారి 18 వ మెట్టు శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాలకుముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు .సబితా ఇంద్రారెడ్డి అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాలలో పాల్గొన్న సబితా ఇంద్రా రెడ్డికి స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు శాలువాలు మెమొంటోలతో సత్కరించిన అయ్యప్ప స్వాములు బృందం..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు..

# రాజమౌళికి మద్దతుగా ఆర్జీవీ



ఇటీవల జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో తాను దేవున్ని నమ్మనంటూ అగ్ర దర్శకుడు రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆ ఈవెంట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో చిరాకుపడిన రాజమౌళి 'నేను దేవున్ని నమ్మను. అయితే హనుమంతుడు నాకు అండగా ఉంటాడని మా నాన్న ఓసారి నాతో చెప్పారు. అయినా ఇలా జరిగింది' అంటూ రాజమౌళి అన్న మాటల పట్ల హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అయితే ఈ విషయంలో అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ రాజమౌళికి మద్దతుగా నిలుస్తూ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 మతపరమైన భావప్రకటన స్వేచ్ఛను రక్షణ కల్పిస్తుందని గుర్తు చేశారు. నాస్తికుడిగా ఉండటం నేరమేమీ కాదని అన్నారు. రాజమౌళి దేవున్ని నమ్మకపోయినా ఆయనకు ఆ దేవుడే అద్భుత విజయాలను అందించాడంటూ తనదైన శైలిలో వ్యంగ్యంగా స్పందించారు. 'రాజమౌళి దేవున్ని నమ్మకపోతే తన సినిమాల్లో దేవున్ని ఎందుకు చూపిస్తున్నారని కొందరు మూరు?లు ప్రశ్నిస్తున్నారు. ఇదే లాజిక్ అయితే..గ్యాంగ్‌స్టర్ సినిమాలు తీసే దర్శకులు గ్యాంగ్‌స్టర్స్ అయి ఉండాలా? హారర్ సినిమా తీసేవాళ్లు దయ్యాలను నమ్మాలా? అని ప్రశ్నించారు. దేవున్ని నమ్మకుండానే రాజమౌళి గొప్ప స్థాయిలోకి వచ్చాడు కాబట్టి చాలా మంది జెలసీ ఫీలవుతున్నారని, అందుకే ఆయనపై విమర్శలు చేస్తున్నారని ఆర్జీవీ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ సోషల్‌మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి.




# అఖండ-2.. ట్రైలర్ వచ్చేసింది!

బాలయ్య-బోయపాటి కాంబోలో వస్తోన్న మరో చిత్రం అఖండ-2. ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణ.. అఘోరా పాత్రలో కనిపించనున్నారు. సంయుక్త మేనన్ హీరోయిన్ కాగా.. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే ది తాండవం, జాజికాయ లాంటి లిరికల్ సాంగ్స్‌ను రిలీజ్ చేశారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బెంగళూరు వేదికగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో అఖండ-2 ట్రైలర్ విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రైలర్ చూస్తుంటే బాలయ్య డైలాగ్స్, మంచు కొండల్లో ఫైట్ సీన్స్ విపరీతంగా ఆకట్టుంటున్నాయి. కష్టమొస్తే దేవుడు వస్తాడు అని నమ్మే జనానికి.. కష్టమొచ్చినా దేవుడు రాడు అని నమ్మించాలి అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ట్రైలర్ చూస్తుంటే సనాతన ధర్మం నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కాగా.. ఇటీవలే ఈ చిత్రాన్ని 2డీతో పాటు త్రీడీ వర్షన్‌లోనూ రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. సినీ ప్రియులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని 2021లో వచ్చిన అఖండకు సీక్వెల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా డిసెంబర్ 5న థియేటర్లలో సందడి చేయనుంది.



# వాటిని చూసి షాకయ్యా

'సాంకేతికత సమాజానికి ఎంత మంచి చేస్తుందో అంత చెడు కూడా చేస్తుంది. మనసుల్లో మలినం పేరుకుపోయిన మనుషుల చేతికి సాంకేతిక వస్తే అది సమాజానికే ప్రమాదం.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు 'మహానటి' కీర్తిసురేశ్. ఆమె తాజా సినిమా 'రివాల్వర్ రీటా' ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె తన వ్యక్తిగత జీవితంపై టెక్నాలజీ ఎలాంటి చెడు ప్రభావం చూపించిందో వెల్లడించారు. 'ఏఐ చేసిన డీప్ ఫేక్ ఫొటోలకు బలైన సినీ సెలబ్రిటీలలో నేనూ ఒకదాన్ని. ఈ టెక్నాలజీని ఉపయోగించి నేను ధరించిన డ్రెస్‌ని మార్చేశారు. నేను అసభ్యకరమైన పోజులిచ్చినట్టు క్రియేట్ చేశారు. చూడ్డానికే అసహ్యంగా ఉన్న ఆ ఫొటోలను చూసి షాకయ్యాను. నేను వివాహితను. ఒకరి ఇల్లాలిని. అలాంటి నాపై ఇలాంటి ప్రయోగాలు చేయడం నన్ను మరింత బాధించింది.' అంటూ వాపోయారు కీర్తి సురేశ్.



# రాజుగారి సందడి షురూ..

పానిండియా సూపర్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ కామెడీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. మారుతి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 23న సినిమా నుంచి తొలిపాటను మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. దీనితో పాటు అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు.ఈ పోస్టర్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. హారర్ కామెడీతో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'ది రాజాసాబ్'ని మారుతి తెరకెక్కిస్తున్నారనీ, భారీ నిర్మాణ విలువలతో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారని, ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కిందని, ప్రభాస్ కెరీర్‌లోనే మెమొరబుల్ మూవీగా 'ది రాజాసాబ్' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్‌దత్ ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: టీజీ కృతి ప్రసాద్.



# ప్రేక్షకుల స్పందన సంతోషాన్నిస్తోంది

### ::: ప్రియదర్శి

ప్రియదర్శి, ఆనంది హీరో హీరోయిన్లుగా, సుమ కనకాల ముఖ్య పాత్రలో నటించిన సినిమా 'ప్రేమంటే..'. రానా దగ్గుబాటి సమర్పణలో నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న (శుక్రవారం) విడుదలైంది. కాగా, సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రియదర్శి మాట్లాడుతూ - "ప్రేక్షకులు మా సినిమాను చూసి, థియేటర్స్ నుంచి హ్యాపీగా నవ్వుకుంటూ బయటకు రావడం సంతోషంగా ఉంది" అని తెలిపారు. "చాలా క్లీన్ సినిమా అని ఆడియన్స్ చెబుతుంటే హ్యాపీగా ఉంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లో చూడాలని ఆడియన్స్‌ను కోరుకుంటున్నాను" అని చెప్పారు నవనీత్. "ప్రేక్షకులు వారి టెన్షన్స్‌ను మర్చి పోయి, హ్యాపీగా మా సినిమాను చూసి ఎంజాయ్ చేయాలని తీసిన చిత్రం ఇది" అన్నారు ఆనంది. "ప్రేమంటే..' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన నిర్మాతగా నాకు సంతోషాన్నిస్తోంది" అని చెప్పారు జాన్వీ నారంగ్.